సాక్షి జోగులాంబ గద్వాల

గురువారం । 9 । జనవరి । 2025



.. హ్యాండ్‌బాల్ టోర్నీ
మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ జరగనుంది.

వివరాలు 8లో ▸



16 నుంచి ఉత్సవాలు
బీచుపల్లి క్షేత్రంలో ఈ నెల 16 నుంచి హయగ్రీవ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /13.5

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



రాజోళి: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసి, వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని డీఈఓ మహమ్మద్ అబ్దుల్ ఘని ఉపాధ్యాయులకు సూచించారు. రాజోళి కొత్త ప్లాట్లలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సాహం అందించాలని సూచించారు. తద్వారా విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెట్టి అద్భుతాలు సృష్టించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భగీరథ రెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హన్మిరెడ్డి, సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ దస్తగిరి, రామాంజనేయులు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

11 మంది బాలకార్మికుల గుర్తింపు

గద్వాల క్రైం: వ్యవసాయ పొలాల్లో బాలలతో పనులు చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గద్వాల మండలంలోని కుర్వపల్లికి చెందిన కుర్వ పరుశరాముడు తన వ్యవసాయ పొలంలో 11 మంది బాలలతో పనులు చేయిస్తుండగా.. ఆపరేషన్ స్మైల్ బృందం గుర్తించారన్నారు. బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారిని అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా చిన్నారులను పనిలోకి పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. బాలకార్మికులను గుర్తించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

క్రీడాస్ఫూర్తి చాటాలి



మల్దకల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, రాజారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, చక్రధర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పెద్ద వీరన్న, వెంకటన్న, సవారి, అజయ్, నరేందర్, మధు, నారాయణ, ఆంజనేయులు, పరుశరాముడు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ. 6,160

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 849 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ. 6,160, కనిష్టంగా రూ. 3,421, సరాసరి రూ. 6,060 ధరలు పలికాయి. 22 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్టంగా రూ. 5,569, కనిష్టంగా రూ. 5,469, సరాసరి రూ. 5,529 ధరలు లభించాయి. 72 క్వింటాళ్ల వరి (సోన) రాగా.. గరిష్టంగా రూ. 2,359, కనిష్టంగా రూ. 2,089, సరాసరి రూ. 2316 ధరలు వచ్చాయి. 187 క్వింటాళ్ల కందులు రాగా.. గరిష్టంగా రూ. 7,606, కనిష్టంగా రూ. 5,059, సరాసరి రూ. 7,351 ధరలు లభించాయి.



ఈ ఫొటోలోని దంపతులు జమ్మన్న, కవిత దంపతులు. వారి ముగ్గురు పిల్లలను ఈ దృశ్యంలో చూడవచ్చు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న కవితను ఆమె భర్త ఇటీవల గద్వాల జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్ ముక్కులో కండ పెరిగిందని.. చిన్న ఆపరేషన్ చేయాలని చెప్పాడు. ఇక్కడ అలాంటి మిషన్ లేదని, మహబూబ్‌నగర్ లేదా కర్నూలుకు తీసుకెళ్లమన్నాడు. అంత స్థోమత లేదని వారు చెప్పడంతో.. తక్కువ ఖర్చుతో ఇక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చేస్తానని ఆ డాక్టర్ నమ్మబలికాడు. తెల్లారి కవితను సదరు ఆస్పత్రికి తీసుకు రాగా.. ఆపరేషన్‌కు తీసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఆమె పరిస్థితి విషమంగా ఉందంటూ అంబులెన్స్‌లో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత ఆమె మృతి చెందింది.

..ప్రభుత్వ వైద్యుడు.. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారనే దానికి ఈ ఘటనే నిదర్శనం. కేవలం గద్వాలలోనే కాదు.. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు పలువురు వైద్యసేవలను వ్యాపారమయంగా మార్చారు. సర్కారు ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించాల్సిన వారు.. కాసుల కక్కుర్తితో దుమ్మాలు కొడుతూ సొంత క్లినిక్‌లు, ప్రైవేట్ హాస్పిటళ్లలో ఓపీలు చూస్తూ, చికిత్సలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రులకు చెందిన పలువురు వైద్యుల ప్రైవేట్ విధులపై 'సాక్షి' ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ప్రభుత్వ వైద్యులు.. ప్రైవేట్‌లో విధులు!

మెరుగైన వైద్యం అంటూ సొంత ఆస్పత్రులకు రెఫర్



- దుమ్మా కొట్టి క్లినిక్‌లలోనే ఓపీలు, శస్త్రచికిత్సలు
- ధనార్జనే ధ్యేయంగా ఆరోగ్యం పేరిట వ్యాపారం
- పేద రోగుల జీవితాలతో చెలగాటం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

పీజీ వైద్యులకు బాధ్యతలు అప్పగించి..

జిల్లా జనరల్ ఆస్పత్రుల్లో వైద్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లా ఆస్పత్రుల్లో కీలక విభాగాలకు చెందిన వైద్యులు పలువురు ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పలు ప్రైవేట్ హాస్పిటళ్లలోనూ చికిత్సలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల రాకను బట్టి కొందరు మధ్యాహ్నం 12 గంటల తర్వాత, మరికొందరు అంతకంటే ముందుగానే పీజీ వైద్యులకు బాధ్యతలు అప్పగించి.. క్లినిక్‌ల బాట పడుతున్నట్లు రోగుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రభుత్వ వైద్యులు సమయపాలన పాటించడం లేదంటూ పలు ఆరోపణలు గతంలోనే వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వైద్యుల సేవలను మెరుగుపరిచేందుకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం తొమ్మిది, మధ్యాహ్నం రెండు గంటలకు.. అంటే వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు వైద్యులు హాజరును నమోదు చేసుకోవాలి. అయితే పలువురు వైద్యులు ఉదయం నిర్ణీత సమయానికి వచ్చి థంబ్ పెట్టి.. హాజరు నమోదు చేసుకుంటున్నారు. గంట, రెండు గంటల పాటు ఉండి గుట్టుచప్పుడు కాకుండా మాయమవుతున్నట్లు సమాచారం. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మళ్లీ వచ్చి హాజరు నమోదు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయినా జనరల్ ఆస్పత్రులకు సంబంధించిన ఉన్నతాధికారులు, అటు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద పెద్ద పెద్ద బోర్డులపై ప్రభుత్వ వైద్యుల పేర్లు బాహాటంగా కనిపిస్తున్నా.. చోద్యం చూస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సర్వం కోల్పోయాం..

ఆర్థికస్థోమత లేకనే నా భార్యను గద్వాల జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లా. ముక్కులో కండ పెరిగిందని.. తీసేయాలని డాక్టర్ చెబితేనే ప్రైవేట్‌కు తీసుకెళ్లా. ఆపరేషన్ కని లోపలికి తీసుకెళ్లిన వాళ్లు.. సీరియస్‌గా ఉందంటూ.. ఆగమాగం చేసి నాతో సంతకం చేయించుకున్నారు. నేనిచ్చిన రూ.15 వేలు నాకిచ్చి.. వారే అంబులెన్స్ మాట్లాడి కర్నూలుకు పంపించారు. అక్కడ రెండు రోజులుగా చికిత్స పొంది చనిపోయింది. మాకు ముగ్గురు పిల్లలు. అందరూ చిన్నోళ్లే. సర్వం కోల్పోయాం. ఎలా బతకాలి. ఎవరూ స్పందిస్తలేరు. మాకు న్యాయం చేయాలి.

– జమ్మన్న, మృతిచెందిన కవిత భర్త

ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

2022 కంటే ముందు సర్వీస్‌లో జాయిన్ అయిన ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు క్లినిక్స్, ఆస్పత్రులు పెట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.2022 తరువాత ప్రభుత్వ సర్వీస్‌లో జాయిన్ అయిన వాళ్లు ప్రైవేటు క్లినిక్స్, ఆస్పత్రులు నిర్వహించకూడదు. అదేవిధంగా ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందించకుండా ప్రైవేటు క్లినిక్స్, ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు ఫిర్యాదులు వస్తే కచ్చితంగా శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే సంబంధిత ప్రైవేటు క్లినిక్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సిద్దప్ప, డీఎంహెచ్‌ఓ, గద్వాల

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

- మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో ప్రధానంగా జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన పలువురు వైద్యులకు న్యూటౌన్, రాజేంద్రనగర్, సుభాష్‌నగర్, మెట్టుగడ్డ, పద్మావతికాలనీ, బోయపల్లి గేట్ తదితర ప్రాంతాల్లో సొంతంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని.. ప్రైవేట్‌గా వైద్యసేవలందిస్తున్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధానంగా గైనకాలజీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో పని చేస్తున్న వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని రవీంద్ర టాకీస్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీ, మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ, వక్ఫ్ బోర్డు సమీప ప్రాంతాల్లో ప్రైవేట్‌గా వైద్యసేవలందిస్తున్నారు.
- నారాయణపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్, డెంటిస్ట్, అనస్తీషియా విభాగాలకు చెందిన పలువురు డాక్టర్లు కలెక్టర్ బంగ్లా సమీపంలో, పాత బస్టాండ్ దగ్గర, శాతవాహన కాలనీతోపాటు తదతర ప్రాంతాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రైవేట్‌గా వైద్య సేవలందిస్తున్నట్లు తెలుస్తోంది.
- వనపర్తి జనరల్ హాస్పిటల్‌లో గైనకాలజీ, పీడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగంలో పని చేస్తున్న వైద్యులు పలువురు కొత్త బస్టాండ్ సమీపంలో, వల్లభ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తున్నారు. ఒకరు సొంతంగా హాస్పిటల్ పెట్టి.. చికిత్సలు చేస్తున్నట్లు సమాచారం.
- గద్వాల జిల్లా జనరల్ ఆస్పత్రిలో పీడియాట్రిక్, అనస్తీషియా, గైనకాలజీ, అప్తమాలిక్ విభాగాలకు చెందిన పలువురు వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తున్నారు. కోర్టు సమీపంలో, కృష్ణవేణి చౌరస్తా, కొత్త బస్టాండ్ వెనుక భాగంలో ఏర్పాటు చేసుకున్న క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

'ఉపాధి'కి ఊతం



ఇటిక్యాల మండలం బీ వీరాపురంలో నాడెప్ కంపోస్ట్ పిట్ నిర్మాణం

- మండలాల వారీగా ప్రాధాన్యత పనుల గుర్తింపు
- నాలుగు నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యం
- కూలీలకు 2,68,260 పనిదినాలు
- రూ. 19.19 కోట్లు కేటాయింపు

జిల్లాలో జాబ్‌కార్డులు:	కూలీల సంఖ్య:
1,56,658	3,51,296

గద్వాలన్యూటౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రజలకు అవసరమైన ప్రధాన పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక రూపొందించారు. గత డిసెంబర్ నుంచి ప్రారంభమైన ఈ పనులను మార్చిలోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. మండలాల వారీగా మొత్తం 2,68,260 పనిదినాలను కూలీలకు కల్పిస్తూ.. రూ.19.19 కోట్ల విలువైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

శాశ్వత ప్రాతిపదికన..

ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ముందుగానే గుర్తిస్తారు. అయితే శాశ్వత ప్రాతిపదికన ఉండే పనులతో పాటు నీటి సంరక్షణ పనులను చేపట్టేలా ప్రణాళికలను రూపొందిస్తారు. వీటిలో కొన్నింటిని పూర్తిస్థాయిలో ప్రాధాన్యతతో కూడిన పనులు త్వరగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 2024 డిసెంబర్ నుంచి 2025 మార్చి వరకు నాలుగు నెలల గడువు విధించింది.ఈ మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి మండలంలో లక్ష్యసాధనకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు 20వేల పనిదినాల లక్ష్యం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇవీ పనులు..

మహిళాశక్తి ఉపాధి భరోసా కింద పశువుల పాకలు, వర్మి కంపోస్ట్, నాడెప్, ఫౌల్ట్రీ షెడ్లు, పొలాల చదును పనులు చేపడతారు. పొలం బాటల కింద పొలాలకు మట్టిరోడ్లు, వన మహోత్సవం ద్వారా నర్సరీల ఏర్పాటు, పండ్లతోటల నిర్వహణ, ఉద్యాన పంటలకు డ్రిప్ ఏర్పాటు చేస్తారు. జలనిధితో చెక్‌డ్యాంలు, వాలుకట్టలు, వాననీటి సంరక్షణ గుంతలు, బావుల పూడికతీత తదితర పనులు చేపడతారు. గ్రామీణ పారిశుద్ధి నిర్వహణ ద్వారా ఇంకుడు గుంతలు నిర్మిస్తారు.

డిసెంబర్ నుంచి మార్చి వరకు మండలాల వారీగా ఉపాధి హామీ పనిదినాలు ఇలా..

అయిజ	అలంపూర్	ధరూరు
29,456	14,728	29,456
గద్వాల	గట్టు	ఇటిక్యాల
29,456	28,404	30,508
కేటీదొడ్డి	మానవపాడు	మల్దకల్
24,196	16,832	26,300
రాజోళి	ఉండవెల్లి	వడ్డేపల్లి
11,572	16,832	10,520

ప్రతి కూలీకి పని కల్పిస్తూ..

ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పిస్తూ.. నిర్దేశించిన పనిదినాలను పూర్తి చేయడంతో పాటు ప్రాధాన్యత పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఆయా మండలాలు, గ్రామాల్లో డిమాండ్, అవసరాల మేరకు పనులను గుర్తిస్తున్నారు. ఉపాధి హామీ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల చదును, పొలం బాటలు, వాననీటి సంరక్షణ, బావుల పూడికతీత, పశువుల పాకలు, నర్సరీలు తదితర పనులు పలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి.

లక్ష్య సాధనకు చర్యలు..



ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పిస్తున్నాం. డిసెంబర్ నుంచి ప్రత్యేకంగా ప్రతి మండలానికి పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశిస్తూ.. శాశ్వత, ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నాం. మార్చి వరకు ఈ పనులు, పనిదినాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింగ్‌రావు, ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్

మిగిలిన పనులు పూర్తిచేయండి



అయిజలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

అయిజ: మున్సిపాలిటీలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని.. వాటిని వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెన వద్ద చేపట్టిన అప్రోచ్ రోడ్డు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. మార్కెట్‌కు ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని.. ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలంలో రోడ్డు డివైడర్‌ను ముందుకు కొనసాగించాలని అధికారులకు సూచించారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి కలెక్టర్ చేరుకొని అధికారులతో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పూర్తిపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం పట్టణంలో నిర్మించిన సీసీ రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ పక్కన చేపట్టిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు గాను రూ. 50 లక్షలు మంజూరు చేయిస్తామని తెలిపారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి..

శాంతినగర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని మండలాల విద్యాధికారులు, హెచ్‌ఎంలతో ఎస్‌ఎస్‌సీ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా 32వ స్థానంలో నిలిచిందని.. ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించి కనీసం 8వ స్థానానికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణతకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు గత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలని సూచించారు. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. రెండు నెలల పాటు కఠిన సాధన చేస్తే లక్ష్యం తప్పకుండా చేరుకుంటామని వివరించారు. అక్షరాస్యతలో జిల్లా పురోగతి సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, డీఈఓ అబ్దుల్ ఘని తదితరులు ఉన్నారు.

పొగాకులో తేమ పేరుతో మోసం



కొనుగోలు కేంద్రంలో పొగాకును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అలంపూర్: పొగాకులో తేమ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలయన్స్–1 కంపెనీ వారు పొగాకు కొనుగోలులో జాప్యం చేయడంతో పాటు తేమ పేరుతో ధరలో కోత విధిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా.. కంపెనీ ఉద్యోగులతో మాట్లాడారు. అగ్రిమెంట్ ప్రకారం రూ. 15,500 ధరకు కొనుగోలు చేయాల్సి ఉండగా.. తేమ పేరుతో రూ. 8వేలు, రూ. 10 వేలకు ఎలా కొంటారని నిలదీశారు. రైతులతో అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీలు పంటసాగు తర్వాత తేమ పేరుతో నష్టపర్చడం సరికాదన్నారు. పొగాకు రైతులకు సాగు వ్యయం భారీగా పెరిగిందన్నారు. కూలీల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి రైతులకు అగ్రిమెంట్ ప్రకారం ధర ఇవ్వకపోవడం దారుణమన్నారు. తేమ పేరుతో ధరలో కోత పెడితే సహించేది లేదన్నారు. రైతుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, నాగేశ్వర్ రెడ్డి, ఈశ్వర్, నాగమల్లయ్య, రవి, జగన్మోహన్ రెడ్డి, సంజీవ రెడ్డి, నర్సింహ, రామకృష్ణ, సుధాకర్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, జగన్ గౌడ్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సూర్యకాంతితో వంట తయారీ..



సూర్యకాంతి ద్వారా వంట చేసుకునే ప్రయోగాన్ని సూర్యాపేటకు జిల్లా నర్సింహులుగూడెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఉపేందర్ రెడ్డి రూపొందించారు. గ్యాస్, విద్యుత్, కలపలు లేకుండా సోలార్ ఎనర్జీతోనే వంట చేసుకునే విధానం ఆకర్షించింది. దీనివల్ల ఎలాంటి కాలుష్యం వెదజల్లకపోగా.. నిర్వహణ భారం తగ్గుతుంది. కేవలం రూ.వెయ్యితో ఒక కుటుంబానికి సరిపడ సోలార్ కుక్కర్ తయారు చేసుకోవచ్చు. మరమ్మతుకు గురైన డిష్‌కు పగిలిన అద్దం ముక్కలు అతికించి, దాన్ని రిఫ్లెక్స్ చేస్తూ పొయ్యిని రూపొందించారు.

మట్టి లేకుండా మొక్కల పెంపకం..



భూమిలేని వారు మట్టి లేకుండానే మొక్కలు పెంచుకునే విధంగా సోలార్ హైడ్రోపానిక్ ప్లాంట్‌ను వికారాబాద్ జిల్లా తాండూరు అక్షర స్కూల్ విద్యార్థి ముఖీద్ రూపొందించారు. భూమిలేని వారు ఇంటి మిద్దెలపై, ప్రహరీపై పైపుల సహాయంతో సోలార్ శక్తి, నీటి ద్వారా ప్రొటీన్లు అందిస్తూ మొక్కలను పెంచుకోవచ్చని నిరూపించారు. తక్కువ ఖర్చుతో ఇంట్లో కూరగాయలు, పూలమొక్కలు పెంచుకునేలా పరికరం ఉపయోగపడనుంది.

మరిన్ని వివరాలు 8లో ▸

వైజ్ఞానిక ప్రదర్శన అదుర్స్

- రెండో రోజు కొనసాగిన సైన్స్ ఫెయిర్
- విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల ప్రదర్శనలు
- దాదాపు 8వేల మంది విద్యార్థుల సందర్శన
- నేటితో ముగియనున్న వైజ్ఞానిక ప్రదర్శన
- దేశానికి దిక్సూచిగా విద్యార్థులు : ఎంపీ డీకే

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఎస్‌వీకేఎంలో ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. రెండవ రోజు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల ప్రదర్శనలు సైతం ఏర్పాటుచేశారు. ప్రదర్శనలోని ప్రయోగ పరికరాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 8వేలమంది విద్యార్థులు తరలివచ్చారు.విద్యార్థులు ఒకేసారి రావటంతో తిరునాళ్లను తలపించేలా గంటల తరబడి బారులు దీరి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం లోపలకు వెళ్లిన విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించి సందేహాలు తీర్చుకోగా ఆలస్యం అవుతున్న కొద్ది కేవలం చూడటానికి మాత్రమే అనుమతిచ్చారు. దీంతో విద్యార్థులు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. గంటల తరబడి వేచి ఉండటాన్ని ఉపాధ్యాయులు తప్పుపట్టారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ఒక్కసారిగా అందరిని ఎలా ఆహ్వానిస్తారంటూ మండిపడ్డారు. పోలీసులు విద్యార్థుల తాకిడిని నియంత్రించేందుకు గేట్లు మూసి వేయాల్సి వచ్చింది. విద్యార్థులతోపాటు కొందరు పేరెంట్స్ సైతం ప్రదర్శన తిలకించేందుకు సుదూర ప్రాంతాలనుంచి తరలి వచ్చారు.


ప్రదర్శనను తిలకిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

ప్రదర్శనలను తిలకించిన ఎంపీ డీకే అరుణ

వైజ్ఞానిక ప్రదర్శనను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ బుధవారం సాయంత్రం సందర్శించారు. ప్రదర్శనలోని చిన్నారుల ఆవిష్కరణలు తిలకించి అబ్బురపడ్డారు. చిట్టి బుర్రల్లో ఇన్ని ఆలోచనలు రావటం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్‌లో దేశానికి దిక్సూచిగా వీరంతా (విద్యార్థులు) మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిరుధాన్యాలతో చింతలేని ఆరోగ్యం: చిన్నారెడ్డి


వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

చిరుధాన్యాలతో చింతలేని ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. వైజ్ఞానిక ప్రదర్శనలో బొటానికల్‌గార్డెన్ నిర్వాహకుడు డా.సదాశివయ్య ఏర్పాటుచేసిన చిరుధాన్యాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పూర్వకాలంలో మన పెద్దలు చిరుధాన్యాలనే తినే వారని, కాలక్రమేణా సైన్స్‌లో జరిగిన మార్పులతో వాటిని పక్కన పెట్టారన్నారు. చిరుధాన్యాల ఆవశ్యకతను గుర్తించాల్సి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇందుకు కృషిచేస్తుందన్నారు.వైజ్ఞానిక ప్రదర్శనలో చిన్నారుల ఆవిష్కరణలను తిలకించి అభినందించారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో రాగులతో జావ విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. సదస్సులో సీపీఓ రవీందర్, సీఎంఓ బాలు యాదవ్, డీఎస్ఓ శ్రీనివాస్, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ మంజులాదేవి, సదస్సు సహాయ నిర్వహకురాలు డా.మంజుల, ఎస్‌వీకేఎం ప్రిన్సిపాల్ ఎబినేజర్‌లు పాల్గొన్నారు.

795 విద్యార్థుల.. 40 ఉపాధ్యాయుల ప్రదర్శనలు


బారులు దీరిన విద్యార్థులు

రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి మొత్తం 795ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇన్‌స్పైర్ 2023–24 విభాగంలో 290 రాష్ట్రీయ రాజ్య స్తరీయ వైజ్ఞానిక్ ప్రదర్శినిలో 505 మొత్తం 790 ప్రదర్శనలొచ్చాయి. వాస్తవానికి 860ప్రదర్శనలు రావాల్సి ఉండగా 70మంది గైర్హాజరయ్యారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా కమ్యూనికేషన్, సహజవ్యవసాయం, గణిత నమూనాలు ఆలోచనలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ వంటి ప్రధాన అంశాలపై విద్యార్థులు ప్రయోగాలను ఏర్పాటుచేశారు. తక్కువ వ్యయంతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా ప్రయోగాలు రూపొందించటంతో ఆహూతులు ప్రశంసలు కురిపించారు. విద్యార్థులతోపాటు బోధన పద్ధతులపై ఉపాధ్యాయులు 40 ప్రయోగాలు ప్రదర్శించారు.

వైద్యశిబిరాలు

వైజ్ఞానిక ప్రదర్శన పురస్కరించుకుని జడ్చర్ల అర్బన్‌హెల్త్‌సెంటర్, గంగాపురం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శ్రీధర్‌రెడ్డి సందర్శించి పలు సూచనలు చేశారు.

- వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు పురస్కరించుకుని గురువారం జరిగే కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర రానున్నారు.

వరదల నుంచి కాపాడే ఈ క్లాడ్



వరద విపత్తులు, మ్యాన్‌హోళ్ల నుంచి కాపాడే ఈ క్లాడ్ వరద విపత్తులు, మ్యాన్‌హోల్‌లో పడి పోయే ప్రమాదాల నుంచి సెన్సార్ల సమయంతో అలారం మోగి ప్రాణాలు కాపాడే ఈక్లాడ్‌ను జూబ్లీహిల్స్ భారతి విద్యాభవన్‌కు చెందిన విద్యార్థిని శ్రీవైష్ణవి, గైడ్ ఉపాధ్యాయురాలు దాక్షాయణితో సిద్ధంచేశారు. డ్రైనేజీ పైప్‌లైన్‌లో చెత్త పేరుకుపోయి నీళ్ల జాం అయినపుడు ప్రమాదస్థాయి దాటుతున్న సమయంలో హెచ్చరించేలా సంబంధిత మున్సిపాలిటీకి సమాచారం అందుతుంది. దీనికి జీపీఎస్ ఉండటంతో ఏప్రాంతంలో సమస్య ఉందో గుర్తించి సిబ్బందికి అక్కడికి చేరుకొని చెత్తను తొలగించి నీళ్ల వెళ్లేలా చర్యలు తీసుకునే అవకాశముంది. మ్యాన్‌హోళ్లలో పడిపోయినా లోపలకు మునగకుండా ఉండేలా గ్లోబల్ కమ్యూనికేషన్ సిస్టం ద్వారా కవచం అడ్డు పడేలా రూపొందించారు. ప్రమాద విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తుంది.

దివ్యాంగుల కోసం ఆటోమెటిక్..



దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు టాయిలెట్‌కు వెళ్లి ఫ్లష్ చేయటం మర్చిపోతుంటారు. అలాంటి వారికి సౌకర్యంగా ఉండేందుకు ఆటోమెటికల్ టాయిలెట్ ఫ్లష్‌ను జనగాం జిల్లా కుందారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రిత్విక్‌కుమార్, గైడ్ టీచర్ శ్రీనివాసాచారితో కలిసి రూపొందించారు. ఫ్లష్‌బాక్స్‌కు ఏర్పాటుచేసిన సెన్సార్ ఆధారంగా వాటర్‌ఫ్లష్ ఆన్ అవుతుంది. దీనికి రూ.2వేలు వ్యయం కానుంది.

ఆపదలో ఆదుకునేలా సేఫ్టీ డివైజ్



మహిళలను ఆపద సమయంలో ఆదుకునేలా ఉమెన్ సేఫ్టీ డివైజ్ విత్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం పరికరాన్ని తునికిబల్లారం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని సంజన, గైడ్ టీచర్ హేమలతతో కలసి రూపొందించారు. సేఫ్టీ డివైజ్‌ను మెడలో వేసుకున్న గొలుసు, బ్యాగ్, రబ్బర్ బ్యాండ్లలో అమర్చుకుని దానికి జీపీఎస్ అనుసంధానం చేయాల్సి ఉంటుంది. సెన్సార్లకు మూడు ఫోన్‌నెంబర్లు ఫీడ్‌చేసి ఆపద సమయంలో దాని ద్వారా సంబంధిత నెంబర్లకు అలర్ట్ మెసేజ్, లొకేషన్ సమాచారం అందుతుంది. వారు స్పందించి కాపాడేందుకు అవకాశం కలిగేలా డివైజ్‌ను రూపొందించారు.

పొగపై అలర్ట్ చేసే..



బహుళ అంతస్తులు, ఫంక్షన్‌హాల్‌లు ఇతర సంస్థల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో వచ్చే పొగనుంచి ముందుగా సమాచారం అందించేలా స్మోక్ డిటెక్టింగ్ సెన్సార్‌ను వనపర్తి జిల్లా బలిజపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాఘవేందర్, యశ్వంత్‌లు, గైడ్ ఉపాధ్యాయుడు మల్లేష్‌తో కలసి ప్రదర్శించారు. అవసరమైనచోట ఎలక్ట్రిక్ సెన్సార్లు అమర్చటంతో పొగ రాగానే అలర్ట్ చేసేలా సిగ్నల్స్ ఇస్తాయి. తద్వారా ప్రమాదాన్ని గుర్తించి జాగ్రత్త పడే అవకాశముంది.

ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంతో..



ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం ముఖ్యంగా తాగిపడేసే వాటర్‌బాటిళ్లను ఉపయోగించి కిచెన్ గార్డెన్ వాల్‌నిర్మాణం చేయవచ్చని వికారాబాద్ జిల్లా తట్టిపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి కార్తీక్, గైడ్ టీచర్ భాగ్యలక్ష్మితో కలసి రూపొందిచాడు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం బాగా పెరిగినందున పర్యావరణ పరిరక్షణ కోసం వాటిని రీయూస్ చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఖాళీ బాటిళ్లలో వ్యర్థాలను నింపి వాటితో గార్డెన్‌వాల్, కిచెన్‌వాల్‌లు నిర్మాణం చేసుకోవచ్చని చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో అక్కడి కలెక్టర్ వాటర్‌బాటిళ్లలో ఇంటి నిర్మాణం చేయించిన విషయాన్ని ప్రదర్శనలో వివరిస్తున్నారు.

వైఫై ని మించి లైఫై

మొబైల్ వినియోగదారులందరికీ వైఫై వినియోగం నిత్యకృత్యమైంది. దానికన్నా చవకగా వందరెట్లు అధికవేగం, భద్రత కలిగిన లైఫైని నారాయణపేటకు చెందిన యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు అమీనానీలం, అర్షియాలు, గైడ్ టీచర్ అశ్వినితో కలసి రూపొందించారు. ఎలక్ట్రిక్ లైటింగ్‌తో సెన్సార్ ద్వారా లైఫై ఆన్ అవుతుంది. మొబైల్, కంప్యూటర్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. దీన్ని ప్రయాణంలో, ఇంట్లో ఎక్కడైనా ఉచితంగా వినియోగించుకునే వీలవుతుంది. హ్యాక్ చేయటానికి వీలు లేదు. రూ.1500 ఖర్చుతో రూపొందించుకోవచ్చు.



వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు..

అకాల, అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా కాపాడే 'ప్రొటెక్షన్ ఆఫ్ క్రాప్స్ ఫ్రం రెయిన్' పరికరాన్ని మేడ్చల్ జిల్లా ధర్మాయిగూడ సెయింట్ అంటోని గ్రామర్ హైస్కూల్ విద్యార్థి ధృవేష్‌రెడ్డి తన గైడ్ టీచర్ ఫణికుమార్‌తో కలసి రూపొందించారు. సోలార్ సిస్టంతో సెన్సార్‌లకు రెయిన్ కవర్ అమరుస్తారు. వర్షం చుక్కలు సోలార్‌పై పడగానే సెన్సార్‌లు యాక్టివేట్ అయి రోలింగ్ కవర్ పంటను, కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కప్పేస్తుంది. కవర్‌పై పడిన వర్షపునీరు పైప్‌లైన్ ద్వారా ఇంకుడు గుంతలకు పంపించేలా పరికరం రూపొందించారు. ఇందుకు ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వ్యయం కానుంది.

క్లుప్తంగా

వాహనం బోల్తా..

- యువకుడి దుర్మరణం


కుమ్మరి నాగరాజు (ఫైల్)

అయిజ: మిర్చి లోడ్‌ను గుంటూరుకు తీసుకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు(25) మంగళవారం మిర్చిని బొలెరో వాహనంలో లోడ్ చేసుకొని గుంటూరుకు బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున గుంటూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడు మృతి


మృతుడు మోహన్ (ఫైల్)

దేవరకద్ర రూరల్: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ఓయువకుడు హైదరాబాద్‌లో ఉరేసుకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. బొల్లారం గ్రామానికి చెందిన మోహన్(21) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలోనే బుధవారం తాను నివాసం ఉండే ప్రాంతానికి సమీపంలో చెట్టుకు ఉరేసుకొని మరణించాడు. స్థానికులు గమనించి గచ్చిబౌలి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. యువకుడి మృతికి కారణాలు తెలియరాలేదు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మక్తల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దాసర్‌పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి వివరాల ప్రకారం.. ఊట్కూర్ మండలం బిజ్వార్‌కి చెందిన పోర్ల నర్సింహ(32) మక్తల్ మండలం దాసర్‌పల్లిలో ఉర్సుకు భార్యాపిల్లలతో వెళ్లాడు. ఉత్సవాలు అయ్యాక రాత్రి దావత్‌కు భార్య పద్మ, పిల్లలు కలిసి వెళ్లారు. తెల్లారే సరికే నర్సింహ ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. గ్రామ సమీపంలోని చెరువు దగ్గర బహిర్భూమికి వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 నుంచి అండర్- 17 నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ

- 36 రాష్ట్రాల జట్ల క్రీడాకారుల హాజరు
- టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం
- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి

మహబూబ్‌నగర్ క్రీడలు: స్థానిక మెయిన్ స్టేడియంలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి తెలిపారు. బుధవారం స్టేడియంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు కోర్టుల్లో లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో పగలు, రాత్రి (ఫ్లడ్‌లైట్ల) వెలుతురులో మ్యాచ్‌లు జరుగుతాయని అన్నారు.

టోర్నీకి అన్ని ఏర్పాట్లు

ఈ టోర్నీలో ఆయా రాష్ట్రాల నుంచి 36 బాలికలు, 35 బాలుర జట్లు పాల్గొంటున్నట్లు శారదాబాయి తెలిపారు. 1550 క్రీడాకారులు, 200 మంది అఫీషియల్స్ హాజరు అవుతారని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బాలికలకు భగీరథకాలనీలోని మూడు బాలికల మైనార్టీ గురుకులాల్లో, బాలురకు బీకేరెడ్డి కాలనీలోని మైనార్టీ బాలుర గురుకులాల్లో వసతి ఏర్పాట్లు చేశారు. టీపీహెచ్ఎస్‌లో క్రీడాకారులందరికీ భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. బాల, బాలికలకు మ్యాచ్‌లు జరిగే సమయంలో స్టేడియంకు తీసుకువచ్చేందుకు స్కూల్ బస్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. టోర్నీ నిర్వహణకు 8 కమిటీలు ఏర్పాటుచేశామని, హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి

ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రముఖులు

10వ తేదీన ఉదయం 11 గంటలకు నేషనల్ టోర్నీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ.జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్, ఎస్పీ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. సమావేశంలో డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్నవీరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, బాల్‌రాజు, జియావుద్దీన్, ఫారుఖ్ ముకర్రం, కోచ్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: స్థానిక మెయిన్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీలకు లిటిల్ స్కాలర్స్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని బి.పారిజాత ఎంపికైంది. ఆపాఠశాల చైర్మన్ అరుంధతిరాయ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పీఈటీలు పాల్గొన్నారు.


విద్యార్థి పారిజాతను అభినందిస్తున్న చైర్మన్, ప్రిన్సిపాల్

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రవల్లి: అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. వివరాలు.. కోదండాపురం స్టేజీలో బుధవారం తెల్లవారుజామున వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్‌నుంచి ఓ లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీలో సుమారు 600 బ్యాగులు (300క్వింటాళ్లు) రేషన్ బియ్యం ఉన్నాయని, వాటి విలువ దాదాపు రూ.14లక్షల వరకు ఉంటుందని అన్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సివిల్ సప్‌లై అధికారి మహర్షి ఫిర్యాదు మేరకు డ్రైవర్ సతీష్‌తో పాటు పంచలింగాలకు చెందిన లారీ ఓనర్ రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని మహిళ మృతి

గోపాల్‌పేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఓమహిళ మృతిచెందిన ఘటన బుధవారం రేవల్లి మండలంలోని కొంకలపల్లిలో చోటుచేసుకుంది. రేవల్లి ఎస్సై రాము తెలిపిన వివరాలు.. కొంకలపల్లికి చెందిన మండ్ల జ్యోతికి (27) అదే గ్రామానికి చెందిన సంజీవ అనే వ్యక్తితో 14ఏళ్ల క్రితం వివాహమైంది. ఎనిమిదేళ్ల క్రితం భర్త సంజీవ మరణించాడు. కుటుంబ కలహాలతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మరణించింది. చుట్టుపక్కలవారు గమనించి కుటుంబ సభ్యులకు చెప్పగా వారు వెళ్ళి చేసేసరికి అప్పటికే మృతిచెందింది. మృతురాలి తండ్రి కురుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీసీరోడ్డుకు నీరు చల్లే విషయంలో వివాదం

- పంక్చర్ టూల్‌తో పొడవడంతో వ్యక్తి మృతి
- మృతుడు రాయచూర్ వాసి


ఖలందర్(ఫైల్)

గట్టు : కొత్తగా వేసిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ కోసం చల్లే నీటి విషయంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం చివరికి ఘర్షణకు దారితీసింది. దీంతో టైర్ల పంక్చర్ వేసే టూల్‌తో పొడవగా ఖలందర్(27) అనే వ్యక్తి మరణించిన సంఘటన మాచర్లలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాచర్లకి చెందిన సైకిల్ షాపు మస్తాన్, అల్లావుద్దీన్ ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. ఇంటి ముందు రెండురోజుల క్రితం కొత్తగా సీసీ రోడ్డును వేశారు. క్యూరింగ్ కోసం నీటిని చల్లే విషయంలో ఆరెండు కుటుంబాలు ఘర్షణ పడ్డాయి. ఇదేక్రమంలో మంగళవారం సైకిల్‌షాపు మస్తాన్.. అల్లావుద్దీన్‌పై చేయి చేసుకోగా అతడు గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాయచూర్‌లో ఉంటున్న అల్లావుద్దీన్ బంధువులు బుధవారం మాచర్లకు చేరుకొని గొడవ విషయంపై ఆరాతీశారు. మస్తాన్ సైకిల్ షాపు దగ్గరకు వారు వెళ్లారు. మస్తాన్ కుమారుడు(మైనర్) పంక్చర్ వేసే పరికరంతో రాయచూర్‌కు చెందిన ఖలందర్‌తో పాటు మరో వ్యక్తిని పొడిచాడు. క్షతగాత్రులను రాయచూర్‌కు తరలించగా ఖలందర్ అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

రాయచూర్‌కు పోలీసులు

మాచర్లలో వ్యక్తి హత్యకు సంబంధించిన విషయం తెలుసుకున్న గద్వాల సీఐ శ్రీనివాసులు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్, గద్వాల రూరల్ ఎస్ఐలు మల్లేష్, శ్రీనివాసులు, నందికర్, శ్రీకాంత్‌తో పాటుగా పోలీస్ సిబ్బంది హుటాహుటిన రాయచూర్ పట్టణానికి చేరుకున్నారు. మాచర్లలో ఉద్రికత పరిస్థితులు నెలకొనకుండా చర్యలు చేపట్టారు.

శ్రీశైలంలో నీటిమట్టం 859.7 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 859.7అడుగుల వద్ద 105.1482 టీఎంసీల నీటినిల్వ ఉంది. భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,435, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల నుంచి కేసీ కెనాల్‌కు 338, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

'పాలమూరు–డిండి'తో ఉమ్మడి జిల్లాకు నష్టం


బహిరంగ లేఖను విడుదల చేస్తున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

మరికల్: 'పాలమూరు–డిండి'తో సాగునీటి పరంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు నష్టం కలుగుతుందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. బుధవారం మరికల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లాకు రాబోయే సాగునీటి కష్టనష్టాలను వివరిస్తూ ఆవేదిక ఆధ్వర్యంలో రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో గల కాల్వలు, రిజర్వాయర్ల నుంచి పాలమూరు–డిండి పేరుతో నీటి తరలిస్తే భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈవిషయాన్ని ఇద్దరు ఎంపీలు, 14నియోజకవర్గాల ఎమ్మెల్యే గ్రహించాలని సూచించారు. పాలమూరు సాగునీటి కష్టాల పరిష్కారం కోసం దశాబ్దాల నుంచి ప్రజలతో పాటు ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు పోరాడుతున్నా ప్రభుత్వాల నుంచి స్పందన రాక పోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి నష్టం కలిగించే ప్రతిపాదనలు తేవడం భావ్యం కాదన్నారు. పోరాడి సాధించుకున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రిడిజైన్ పేరుతో జూరాల నుండి 90 మీటర్ల దిగువకు శ్రీశైలం ప్రాజెక్టులోకి మారవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సులభంగా నిత్యం లక్ష క్యూసెక్కులకు పైగా నీరు తరలించుకు పోతుందన్నారు. ఈ జిల్లా నుంచి రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఎంతవరకు న్యాయం చేస్తారో వేచి చూడాలని అన్నారు. ఉమ్మడి జిల్లా సాగునీటి వనరుల కోసం తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో ఆవేదిక సభ్యులు తిప్పన, సుదర్శన్, వెంకట్రాములు, సతీశ్‌బైరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్తూ అనంత లోకాలకు..

- బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
- తల్లీ, కూతుళ్లు దుర్మరణం.. తండ్రికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్‌లో ఘటన
- మృతులు కల్వకుర్తి మండలం తిమ్మరాశిపల్లి వాసులు


మృతిచెందిన తల్లికూతురు లక్ష్మమ్మ, విజయ(ఫైల్)

పహాడీషరీఫ్/కల్వకుర్తి టౌన్: అనారోగ్యంతో ఉన్న కూతురుకు చికిత్స చేయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. ఈప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు చివరకు అదేఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం విగతజీవులుగా వెళ్లాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన చిత్తారి గోపాల్(36), లక్ష్మమ్మ (34) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వీరి పెద్ద కూతురు విజయ(14)కు ఎర్రరక్తకణాలు తక్కువగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఉదయం 7.30గంటలకు వారిబైక్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి బయలుదేరారు. ఉదయం 9.45గంటల సమయంలో తుక్కుగూడ ఓఆర్ఆర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న టిప్పర్ డ్రైవర్ శంషాబాద్ టోల్ వైపునకు వాహనాన్ని మళ్లించాడు. ఈక్రమంలో టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో పడిపోయిన లక్ష్మమ్మ, విజయ తలమీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో తల్లీకూతురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. లారీడ్రైవర్ పరారీలో ఉన్నారు. తిమ్మరాశిపల్లివాసుల్లో విషాదం చోటు చేసుకుంది.